క్లుప్తంగా

ప్రమాదవశాత్తు పెంకుటింట్లో మంటలు

మరికల్: మండలంలోని పల్లెగడ్డలో ప్రమాదవశాత్తు ఓ పెంకుటింట్లో మంటలు చెలరేగాయి. ఆదివారం అమావాస్య కావడంతో మణెమ్మ అనే మహిళ ఇంట్లో పూజలుచేసి దీపం ముట్టించింది. ప్రమాదవశాత్తు పక్కన ఉన్న దుప్పట్లకు నిప్పు అంటుకోవడంతో మంటలు చెలరేగాయి. వెంటనే తెరుకున్న కుటుంబ సభ్యులు, సిలిండర్‌ను బయటకు తీసుకొచ్చి మంటలను నీళ్లతో ఆర్పివేశారు. అప్పటికే బియ్యంతో పాటు వంట సామగ్రి, దుస్తులు, బీరువా దగ్ధమయ్యాయి. ఇంట్లో వస్తువులు కాలిపోవడంతో ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

నేడు పశువైద్య శిబిరం

నర్వ: మండలంలోని పాథర్చేడ్, జంగంరెడ్డిపల్లిలో ప్రత్యేక పశువైద్యశిబిరాలు సోమవారం నిర్వహిస్తున్నట్లు మండల పశువైద్యాధికారి డా. అశోక్ తెలిపారు. గాలికుంటు వ్యాధి నివారణకోసం అందించే టీకాలను పశువులకు వేసేందుకు నిర్వహించే ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశుపోషకులు తప్పకుండా తమ పశువులకు టీకాలను వేయించాలన్నారు.

సన్నాహక సమావేశానికి తరలిరండి

నర్వ: మహబూబ్‌నగర్ పార్లమెంట్ సన్నాహక సమావేశానికి బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని పార్టీ మండల అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మహబూబ్‌నగర్‌లోని జేజేఆర్ గార్డెన్స్ ఎనుగొండలో ఉదయం 10గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి మండల పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశానికి మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ మన్నెశ్రీనివాస్‌రెడ్డి హాజరవుతున్నారన్నారు.

మరికల్: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో సోమవారం బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి మన్నెం శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగే పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని మండల అధ్యక్షుడు లంబడి తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



కృష్ణా: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను టాస్క్‌ఫోర్స్ బృందం పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఆదివారం మండలంలోని గుడెబల్లూర్ గ్రామానికి చెందిన మూడు ఇసుక ట్రాక్టర్లు ఆదివారం కృష్ణానది నుంచి కున్సి గ్రామానికి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా హిందుపూర్ శివారులో టాస్క్‌ఫోర్స్ బృందం పట్టుకుని వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు.. ఎస్‌ఐ నవీద్ మాట్లాడుతూ.. అక్రమంగా ఇసుకను తరలిస్తే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బస్‌షెల్టర్ లేక ఇబ్బందులు



మద్దూరు: మండలంలోని చెన్వర్, దుప్పట్‌గట్, అప్పిరెడ్డిపల్లి, చెన్నరెడ్డిపల్లి, నాగంపల్లి గ్రామాలు ఆర్‌అండ్‌బీ రోడ్లకు బస్‌షెల్టర్లు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ఈ గ్రామాల ప్రజలు వేరే గ్రామాలకు వెళ్లాలంటే తప్పనిసరిగా స్టేజీల వద్దకు రావాల్సిందే. ఈ బస్‌స్టాప్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కొత్తపల్లి నుంచి భూనీడ్‌కు వెళ్లేదారిలో నిడ్జింత బస్‌షెల్టర్‌ను ఏర్పాటు చేశారు. గత 9ఏళ్లుగా నిరుపయోగంగా మారింది. ఇక్కడ అవసరం లేకపోయిన బస్‌షెల్టర్ ఏర్పాటు చేయడంతో ప్రభుత్వం ధనం వృథాఅయింది. అవసరమున్న చోట బస్‌షెల్టర్‌ను నిర్మించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

'కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు ఖాయం'

ఆత్మకూర్: కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చిందంటే తప్పదని, ఆరు గ్యారంటీ పథకాల్లో ఇప్పటికే నాలుగింటిని అమలు అవుతున్నాయని నాయకులు గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, తులసీరాజ్, పరమేష్, నల్గొండ శ్రీను అన్నారు. ఆదివారం మక్తల్‌లో జరిగిన పార్లమెంట్ సన్నాహక సమావేశానికి ఆత్మకూర్ నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. రూ.10లక్షలతో ఉచిత వైద్యం, రూ.500లకే వంటగ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌తో ప్రజల్లో కాంగ్రెస్‌పై నమ్మకం ఏర్పడిందన్నారు. త్వరలోనే రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు, మహిళామణులకు రూ.2,500 అందించనున్నట్లు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంటులో కాంగ్రెస్ అభ్యర్థి చల్ల వంశీచందర్‌రెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీడీ శ్రీను, దాము, సాయిరాఘవ, మహేష్, అశోక్, వెంకటనర్సింహారావు, ముక్తేశ్వర్, వినయ్‌రెడ్డి, అజ్మత్, గంగ, దస్తగిరి, గడ్డం శ్రీనివాస్, షంశీర్, చిరంజీవి, సూరి, మల్లేష్, అబ్దుల్లా, రఘు, మధు తదితరులు ఉన్నారు.

పసలేని పశువుల బీమా

- రైతులను ఆదుకోని పథకం
- 9ఏళ్ల క్రితం ఎత్తేసిన పశువుల బీమా పథకం
- పట్టించుకుని పశువైద్యశాఖ అధికారులు

మద్దూరు: రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయమని రైతుల కోసం వివిధ పథకాలను చేపడుతున్నామని చెప్పేమాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. పాడి పశువులు అనారోగ్యం, ఇతర కారణాలతో చనిపోతే బీమా సౌకర్యం లేక రైతులు ఆర్థికంగా నష్టపోతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాడి పశువులకు బీమా ఉంటే ఆయా సంస్థల నుంచి గతంలో పశువుల అంచనాను బట్టి రూ. 50వేల వరకు పరిహారం వచ్చేది. ప్రస్తుతం ప్రభుత్వం ఎలాంటి సౌకర్యం కల్పించకపోవడంతో పశువులు చనిపోతే ఆర్థికంగా నష్టపోవడంతో పాటు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బీమా సౌకర్యం కల్పించాలి..

గత ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకానికి ప్రభుత్వం మొదటిసారి బీమా సౌకర్యం కల్పించింది. కానీ యాదవులకు పంపిణీచేసిన గొర్రెలు బీమా సంవత్సరం ముగిసిన తర్వాత రెన్యూవల్ చేయకపోవడంతో గొర్రెలకు కూడా ప్రస్తుతం బీమా లేకుండా పోయింది. ప్రభుత్వం పంపిణీచేసిన గొర్రెలతోపాటు, రైతుల వద్ద ఉన్న గేదెలకు, ఎద్దులకు, పశువులకు సైతం ప్రభుత్వం ఎప్పటిలాగా 50శాతం నిధులను కేటాయించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పాడి పరిశ్రమే జీవనాధారం

మండలంలోని మద్దూరు, నిడ్జింత, రెనివట్ల, భూనీడ్, నందిపాడ్, చింతల్‌దిన్నే, పెదిరిపాడ్, చెన్నారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో రైతులకు వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమ జీవనాధరంగా మారింది. రైతులు వ్యవసాయంతోపాటు గేదెలు, ఆవుల పెంపకం చేపడుతున్నారు. మండల కేంద్రంలోని డైరీలకు పాలను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు.



నిడ్జింతలో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది (ఫైల్)

బీమా అవకాశం కల్పించాలి

పాడి ఆవులు, గేదెలతో పాటు ఎద్దులకు బీమా సౌకర్యం కల్పిస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. వ్యాధుల బారిన పడి, ఇతర కారణాల వలన పశువులు మృతి చెందితే రైతులకు నష్టం వాటిల్లకుండా ఉంటుంది.

– శ్రీనునాయక్, రైతు, ఎర్రగుంటతాండా

ప్రభుత్వం బీమా నిలిపివేసింది.

గతంలో ఉన్న బీమా పథకాన్ని ప్రభుత్వం నిలిపివేయడంతోనే పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ జనరల్ బీమా సౌకర్యం ఉండేది. ఆరేళ్లుగా ఈ పథకాన్ని నిలిపివేశారు. ఈ బడ్జెట్‌లో కూడా బీమాకు నిధులు కేటాయించలేదు.

– రాఘవేందర్‌గౌడ్, పశువైద్యాధికారి, మద్దూరు

వైద్య విజ్ఞాన సదస్సు విజయవంతం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విశ్వనాథ్

నారాయణపేట రూరల్: స్థానిక శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన వైద్య విజ్ఞన సదస్సు విజయవంతమైంది. స్థానిక గీతా ఆస్పత్రి వైద్యులు డాక్టర్ విశ్వనాథ్, డాక్టర్ గీత ముఖ్య అతిథులుగా హాజరై ఆర్‌ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చారు. దీర్ఘ కాలిక వ్యాధులు, సిజనల్ వ్యాధులు, వేసవి దృష్ట్యా వచ్చే రోగాలకు సంబంధించి నివారణ విషయాలను తెలియజేశారు. వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రోగులకు చెప్పాలన్నారు. రఘు, గోపాల్, నాగభూషణం, హర్షిద్, సత్యకుమార్, హుసేన్‌పాష, ఖాసీం, వెంకట్రాములు, చింతలయ్య పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టే పార్టీలకే మద్దతు

మద్దూరు: ఎస్సీ వర్గీకరణ చేపట్టే పార్టీలకే ఎమ్మార్పీఎస్–ఆర్‌ఆర్ మద్దతు పలుకుతుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాయికంటి రాందాస్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో నాయకులు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ పార్లమెంట్‌లో చట్ట బద్ధతకోసం 30ఏళ్లుగా పోరాటం చేస్తుందన్నారు. అనేక మార్లు అసెంబ్లీలో తీర్మానం చేసినా కేవలం ఒక్క మాల కులం వ్యతిరేకతతో ఎన్నికల సమయంలో మాట ఇచ్చిన పార్టీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. గత బీఆర్‌ఎస్ మోసం చేస్తే ఇప్పుడు కాంగ్రెస్ రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో ఒక్క మాదిగ లేదన్నారు. స్పష్టమైన హామీ ఇచ్చే రాజకీయ పార్టీకే మాదిగ, ఉపకులాల వారు పార్లమెంట్ సభ్యులను గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్–ఆర్‌ఆర్ నాయకులు కృష్ణ, చిన్నయ్య, సాయిలు, పత్యప్ప, భీంరాజు, లక్ష్మణ్, వెంకట్, మోహన్, రాములు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాయికంటి రాందాస్

ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను విమర్శించడం తగదు

నర్వ: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను విమర్శించడం తగదని బీఎస్పీ అసెంబ్లీ అధ్యక్షుడు గువ్వల తిరుపతి అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు.. నిత్యం ప్రజాసమస్యల కోసం పరితపించే ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను విమర్శించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీఎస్పీ వ్యవస్థాపకులు కాన్షిరాం ఆనాడు ఆయా రాజకీయ పార్టీలతో పొత్తుపెట్టుకుని రాజ్యాధికారాన్ని సదించగలిగాడన్నారు. ఆయన అడుగు జాడల్లోనే నేడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పొత్తులపై చర్చలు జరుపుతుంటే తమ పార్టీకి ఉనికి లేనట్లు అవుతుందని అవాక్కులు, చవాక్కులు మాట్లాడుతున్నారన్నారు. తన పదవీని త్యాగం చేసి పేదల పక్షాన ఉండి పోరాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బండారి చంద్రశేఖర్, అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకటయ్య, మండల అధ్యక్షుడు పుత్రసేన తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

ఆలయాల్లో అమావాస్య పూజలు



మరికల్‌లో ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నారాయణపేట రూరల్: జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాలలో ఆదివారం అమావాస్య పూజలు ఘనంగా కొనసాగాయి. రాష్ట్రాల సరిహద్దులోని కాలబెలగుంది క్షేత్రంలో స్వామివారికి సుప్రభాతం, రుద్రాభిషేకం, బిల్వార్చన, అష్టోత్తరనామావళి, అభిషేకం, అలంకరణ, హారతి తదితర పూజలు నిర్వహించారు. భక్తులకు సర్వదర్శనం కల్పించి అన్నదానం చేశారు. అదేవిధంగా పట్టణంలోని అయ్యప్ప స్వామి, సింగార్‌బేస్ శివలింగేశ్వరదేవాలయం, మహంకాళివీధి శివాలయం, బైరంకొండ శివాలయం, ఎక్లాస్‌పూర్ తిమ్మప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అన్నదానం నిర్వహించారు.

మరికల్: అమావాస్య సందర్భంగా మండలంలోని ఆదివారం పలు ఆలయాల్లో భక్తులతో కిటకిటలాడాయి. హనుమాన్‌వాడ ఆంజనేయ, మాణికేశ్వరి, బీరప్ప ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో ఆలయాల్లో గ్రామస్తులు దేవాత మూర్తులకు పూజలు చేసి తీర్థ ప్రసాదలతో పాటు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పూజరులు సుందరయ్యశర్మ, వెంకటేశ్వర్లశర్మ, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పేటలో ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

మహిళా మోర్చ అధ్యక్షురాలికి సన్మానం



నారాయణపేట రూరల్ : బీజేపీ మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లో స్థానిక మహిళలు కలిసి ఆమెను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో పార్టీ అభ్యున్నతికి, మహిళలను చైతన్య పర్చడంలో చేపడుతున్న కార్యక్రమాలు వివరించారు. కార్యక్రమంలో పద్మజారెడ్డి, లక్ష్మి, లలిత, సాహితి రెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్ మృతి

నారాయణపేట రూరల్ : మండలంలోని పేరపళ్ల గ్రామ రెండో అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న హెల్పర్ అమృతమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ సీఐటీయూ నాయకులు నివాళులర్పించారు. ఈ మేరకు.. ఆ సంఘం జిల్లా కార్యదర్శి బలరాం మాట్లాడుతూ.. ముప్పై సంవత్సరాలుగా ఐసీడీఎస్‌కు సేవలు అందిస్తున్న అమృతమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు శారదమ్మ, సత్యమ్మ, భాగ్యలక్ష్మి, హెల్పర్లు అనంతమ్మ, సుజాత, లక్ష్మి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కోయిల్‌కొండ: మండలంలోని సూరారం ఉన్నత పాఠశాల (2011–12) పూర్వ విద్యార్థుల ఆత్మీయం సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నాటి రోజులను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వవిద్యార్థుల సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్, ప్రధానకార్యదర్శిగా సురేష్, శ్రీశైలం, బాలయ్య, కవిత ఎన్నికయ్యారు.



నేటి నుంచి పరమేశ్వరస్వామి జాతర



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్‌ఐ నరేందర్

ఆత్మకూర్: పట్టణ శివారులోని చెరువులో వెలసిన స్వయంభు పరమేశ్వర స్వామి జాతర సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 11, 12, 13 తేదీల్లో రాత్రి 9గంటలకు తేరు మహోత్సవం కనుల పండుగగా జరుగనుంది. ఆత్మకూర్ సంస్థానాధీశుల కాలం నుంచి పరమేశ్వరస్వామి జాతర గతంలో ఘనంగా నిర్వహించేవారు. ఆత్మకూర్‌లో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు జాతరను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమ, మంగళ, బుధవారం రాత్రిల్లో మూడు రోజులపాటు ప్రత్యేక పూజలతో పాటు పల్లకీసేవ, రథోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు.

జాతర సందర్భంగా బందోబస్తు..

చెరువు మధ్యలో ఉన్న పరమేశ్వరస్వామి ఆలయం వద్ద నీటి ఉధృతి ఉండడంతో ప్రమాదాలు జరుగకుండ చర్యలు చేపడుతున్నామని ఆత్మకూర్ ఎస్‌ఐ నరేందర్ అన్నారు. ఆదివారం సాయంత్రం పరమేశ్వరస్వామి ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆలయ పూజారి కర్ణసయ్యకు, భక్తులకు పలు సూచనలు చేశారు. పోలీసుల ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తును నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు నీటిలోకి వెళ్లకుండా ఆలయంలోకి ప్రవేశించి పూజలు నిర్వహించుకోవాలని సూచించారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

మక్తల్: ప్రజలు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని మంతన్‌గోడ్ గ్రామాల్లో కేంద్రసాయుధ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల సమయంలో శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు కేంద్రసాయుధ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలు ఎలాంటి బయాందోళనలకు గురికావొద్దని, పోలీసులు అప్రమత్తంగా ఉండి ఎన్నికలను శాంతియుతంగా జరిగేవిధంగా చర్యలు చేపడుతారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ–2 ఆచారి తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల్లో రవన్నది క్రియాశీల పాత్ర



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఊట్కూరు: భూమి, భుక్తి, విముక్తి కోసం జరిగిన పోరాటాల్లో కామ్రేడ్ రవన్న క్రియాశీలకంగా పాల్గొన్నారని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి సలీం అన్నారు. కామ్రేడ్ రవన్న వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని బిజ్వార్ స్థానిక భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. కామ్రేడ్ రవన్న సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా కేంద్ర కమిటీ సభ్యుడు, ఉమ్మడి ఏపీ రాష్ట్ర కార్యదర్శి ఉంటూ పీడీత ప్రజల నాయకుడిగా పేరు సాధించారని, బలమైన ప్రతిఘటనోద్యమాలను నిర్మించడమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. కిరణ్, సిద్దు, చెన్నప్ప, ఆశప్ప, గోవిందు, కృష్ణయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే వర్ధంతి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మాగనూర్: మండల పరిధిలోని మందిపల్లిలో సావిత్రి బాయి పూలే వర్ధంతిని ఆదివారం జై భీమ్ సేన సమితి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వాహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు యంకే నాగేష్ మాట్లాడుతూ.. మహిళ అభ్యున్నతితో పాటు మహిళలకు చదువు ఉండాలని ఉద్యమించిన మహానుబావురాలని కొనియాడారు. దేశంలోనే మొదటి మహిళ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహించి మహిళలకు పురుషులతో సమానంగా విద్యను చాటిచెప్పారన్నారు. సావిత్రి బాయి పూలే ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, ఆనంద్, బన్నీ, ప్రశాంత్, నితీన్, కాంగ్రెస్ నాయకులు రంగప్ప, హన్మంత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఉద్యోగులకు ఘన సన్మానం



మహిళ ఉద్యోగులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మక్తల్: మహిళ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఆదివారం తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులను జిల్లా తపస్ సంఘం అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మహిళ ఉద్యోగులకు శాలువాతో సన్మానం చేశారు. ఈ మేరకు.. పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంకోసం సంఘాలతో సీఎం రేవంత్ సమావేశం ఏర్పాటుచేయడం శుభాపరిణామమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, బాల్‌రాజ్, శ్రీనివాస్‌రెడ్డి, సురేష్, రవీందర్, రవికుమార్, మల్లేష్, చంద్రకాంత్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

మరికల్: కోర్టులో ప్రభుత్వ ఉదోగ్యం సాధించిన మరికల్‌కు చెందిన పేదింటి అమ్మాయి సుస్మితను మహిళ దినోత్సవం సందర్భంగా ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత శ్రీమతి ఉమామహేశ్వరి సత్కారించారు. ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రుల కష్టానికి ప్రభుత్వ ఉదోగ్యం సాధించిన సుస్మితను ఇతర అమ్మాయిలు ఆదర్శంగా తీసుకొని మంచి ఫలితాలను సాధించాలని సూచించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



స్కూల్‌లో నృత్యాలు చేస్తున్న చిన్నారులు

నారాయణపేట రూరల్ : పట్టణంలోని సింగార్‌బేస్ శిశుమందిర్ స్కూల్‌లో రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అలరించాయి. పాఠశాల వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థులు చక్కటి వేశాధారణతో దేశభక్తి పాటలకు నృత్యాలు చేశారు. రైతు, సైనికుడి ప్రాధాన్యతతో చేపట్టిన నాటికలు అలరించాయి. అంతకుముందు ముఖ్య అతిథిగా హాజరైన రతంగపాండురెడ్డి మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. టెన్త్ పరీక్షల్లో చక్కటి జీపీఏ సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రఘుపాల్‌రెడ్డి, డీసీసీబీ సెక్రటరీ రమేష్‌రెడ్డి, ఎల్లప్ప, సీతారాములు, శ్రీనివాస్‌రెడ్డి, దత్తుచౌద్రి పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ఆత్మకూర్: ఆత్మకూర్ మండలపరిధిలోని కత్తేపల్లి గ్రామశివారులో పేకాట ఆడుతున్న శిబీరంపై దాడి నిర్వహించినట్లు సీఐ శివకుమార్, ఎస్సై నరేందర్ తెలిపారు. ఆదివారం సాయంత్రం కత్తేపల్లిలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించామని ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నామని వారినుండి రూ.5220 నగదు, నాలుగు బైకులు, ఐదుసెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. సంఘటన స్థలంనుండి పారిపోయిన మరోఇద్దరిపైకూడ కేసులు నమోదు చేసామని, జూదం ఆడేవారిపై గట్టినిఘాను ఏర్పాటు చేసుకున్నామని ఎంతివారైన ఉపేక్షించేది లేదని కేసులు నమోదుచేసి కోర్టుకు హాజరుపరుస్తామని అన్నారు.